క్లుప్తంగా

12 నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నవంబర్ 12 నుంచి ప్రారంభమవుతాయని ఆలయ పెద్దలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13వ తేదీన ప్రభోత్సవం, కల్యాణం, 14న రథోత్సవం, 15న స్వామివారి పల్లకీసేవా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులకు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

కేటీదొడ్డి: మండల కేంద్రంలో నవంబర్ 2న రైతువేదికలో ఉదయం 11గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మహ్మద్ అజార్ మోహిద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ప్రజల సమస్యలు పట్టవా?

శాంతినగర్: ప్రజల ఓట్లు కావాలి గాని వారి సమస్యలు ప్రజాప్రతినిధులు, అధికారులకు పట్టవా అని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు మండిపడ్డారు. వడ్డేపల్లి మండల పరిధిలోని తనగల గ్రామంలో మంగళవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సీ కాలనీలో రోడ్డుపై నిలిచిన మురుగు నీటిని చూసి అవాక్కయ్యారు. ప్రజలచే ఎన్నుకోబడిన వారు కనీసం డ్రెయినేజీ కాల్వలు నిర్మించకపోవడం దారుణమన్నారు. బహుజన్ సమాజ్‌పార్టీని ఆదరిస్తే ప్రతి గ్రామాన్ని చక్కగా తీర్చిదిద్దుతామని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. జిల్లా అధ్యక్షుని వెంట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, కోశాధికారి నాగేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు లక్ష్మన్న, రాజోళి మండల అధ్యక్షుడు వెంకటేష్, జలంధర్, మహేందర్, రాజు పాల్గొన్నారు.

తుమ్మిళ్ల వద్ద సిల్ట్ తొలగింపు



రాజోళి: తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం వద్ద ఉన్న జీరో పాయింట్ దగ్గర సిల్ట్ తొలగింపు పనులు మంగళవారం మొదలయ్యాయి. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు జేసీబీతో పనులు ప్రారంభించారు. ఆర్డీఎస్ ఆయకట్టుకు నీరు అందించే క్రమంలో ఎగువ నుంచి రావల్సిన ఇండెంట్ విషయంలో రెండు రోజుల కిందట రెండు రాష్ట్రాల సాగు నీటి శాఖ అధికారులతో చర్చించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఎగువ నుంచి ఇండెంట్ వస్తుండటంతో, వచ్చే నీటిని తుమ్మిళ్ల ద్వారా ఆర్డీఎస్ ఆయకట్టుకు అందించేందుకు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో వచ్చిన నీటికి సిల్ట్ అడ్డుపడి దిగువకు వెళ్లకుండా, లిఫ్టుకు నీరు అందించే తుంగభద్ర నది జీరో పాయింట్ వద్ద సిల్ట్, ఇతర వ్యర్థాల తొలగింపు పనులు ముమ్మరం చేశారు.

సకాలంలో పన్ను చెల్లించండి

అయిజ: పురపాలక పరిధిలో ఉన్న నివాస గృహాల, వ్యాపార భవనాల యజమానులు సకాలంలో పన్ను చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ నిత్యానందన్ కోరారు. మంగళవారం మున్సిపల్ సిబ్బంది ఇంటింటికి తిరిగి ఆస్తి పన్ను వసూలు చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడారు. అయిజ పురపాలక సంఘం ఆస్తి పన్ను మొత్తం రూ. 1.60 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ. 69 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ గోపాల్, మేనేజర్ రాజేష్, బిల్ కలెక్టర్ మహేంద్ర నాథ్ పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు ఉచిత టీకాలు

అయిజ: గొర్రెలకు, మేకలకు పారుడు రోగం రాకుండా ప్రభుత్వం చేపట్టిన ఉచిత టీకాల కార్యక్రమం కొనసాగుతోంది. ఉచిత టీకాల్లో భాగంగా మంగళవారం పులికల్, పర్దీపురం గ్రామాల్లో వెటర్నరీ సిబ్బంది గొర్రెలు, మేకలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో మొత్తం 2331 గొర్రెలకు, 124 మేకలకు టీకాలు వేసినట్లు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూప రాణి తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకందారులందరూ ప్రభుత్వం అందించే ఉచిత టీకాలను వేయించాలని

గద్వాల వ్యవసాయం: పీపీఆర్ టీకా వేయించడం వల్ల గొర్రెలు, మేకల్లో పారుడు వ్యాధిని నివారించవచ్చని మండల పశువైద్యాధికారి శంకరయ్య అన్నారు. మంగళవారం మండలంలోని తెలుగోనిపల్లి, పూడూరు ఎర్రవల్లిలో పశుసంవర్ధశాఖ ఆధ్వర్యంలో జీవాలకు పారుడు రోగ నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో వీఏలు శశికుమార్, ఫణీంద్రరాజు, జేవీఓ మాధవీలత, కృష్ణయ్య, రాముడు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

అలంపూర్ రూరల్: మండలంలోని లింగన్‌వాయిలో బోయ బీసన్న కినషాపుపై మంగళవారం దాడి చేసినట్లు ఎస్‌ఐ మడుగు రమేష్ తెలిపారు. ఈ దాడిలో రూ.4040 మద్యం 6.49 లీటర్లు స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

'ఉన్నతి'పై కూలీలకు శిక్షణ

- వర్మీ కంపోస్ట్, ఫుడ్ మిలెట్స్ తయారీపై..
- ఉండవెల్లి, అలంపూర్ మండలాల్లో ఎంపికైన వారికే..
- 15 రోజుల పాటు శాస్త్రవేత్తల సమక్షంలో అవగాహన



ఉండవెల్లిలో ఉన్నతి ప్రాజెక్ట్ శిక్షణలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు(ఫైల్)

ఉండవెల్లి: వ్యవసాయ రంగంలో ప్రస్తుతం అధిక మోతాదులో ఎరువులు చల్లడం, మందులను పిచికారీ చేయడం వల్ల పంటలు దెబ్బతినడమే కాకుండా మనుషులకు ఇబ్బందులున్నాయని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ఎరువుల దుకాణం, క్రిమి సంహారక మందుల దుకాణాలు అధికంగా ఉన్నాయి. వారు ఇచ్చే మోతాదులో పిచికారీ చేయడం వల్ల వ్యాధులు వ్యాపిస్తాయి. కృషి విజ్ఞాన్ కేంద్రంలోని శాస్త్రవేత్తలు ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేసి కలెక్టర్, డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు వర్మీ కంపోస్ట్ ద్వారా వ్యవసాయంలో మార్పులు తెచ్చేందుకు అవగాహన కల్పించారు.

15 రోజుల పాటు శిక్షణ..

అక్టోబర్ 12 నుంచి డిసెంబర్ 31 వరకు జాబ్ కార్డులు ఉన్న ఉపాధి కూలీల రైతులను ఎంపిక చేసి వారికి రూ. 272 కూలిని రోజూ నిర్ణయించి జమ చేస్తారని, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కృషి విజ్ఞాన కేంద్రంలో సీనియర్ శాస్త్రవేత్త దాదాసాహెబ్ కాగ్రే, భవానీ ఆధ్వర్యంలో డీఆర్‌డీఓ ఉమాదేవి శిక్షణ ప్రారంభించారు. శిక్షణలో గ్రామ పంచాయతీల్లో తయారైన కంపోస్ట్ ఎరువును, వర్మీ కంపోస్ట్‌గా తయారు చేసుకుని వాటిని పంట పొలాల్లో చల్లితే వచ్చే లాభాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ప్రతి డంపింగ్ యార్డులో రైతు కల్లాలో నిల్వ చేసిన పశువుల ఎరువుతో వానపాములను కలిపి వర్మీ ఎరువులను తయారు చేసి, చల్లించాలని సూచించారు. వ్యవసాయరంగంలో ఇలాంటి పాతకాలంలో పయోగించే వారని, ప్రస్తుతం ఇలాంటివి తయారు చేసి పొలాల్లో చల్లితే ఖర్చులు తగ్గి,



ఫుడ్ మిలెట్ శిక్షణలో పాల్గొన్న మహిళలు

మోతాదులో ఎరువులను ఎలా ఉపయోగించవచ్చో శిక్షణలో పేర్కొన్నారు.

శిక్షణ పూర్తి...

15 రోజులపాటు ఉండవెల్లి, అలంపూర్ మండలల్లోని ఉపాధి కూలీలు 100 రోజులు పూర్తి చేసిన వారిలో కూలీలను ఎంపిక చేసి 18 నుంచి 40 ఏళ్లు పూర్తి చేసుకున్న వారికి మాత్రమే అర్హులుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకం ద్వారా 2018–19 నుంచి 2023–24 ఉపాధి పథకంలో వంద రోజులు పనిచేసిన వారికి మాత్రమే శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉన్నతి నైపుణ్యాభివృద్ధి కొరకై ఉన్నతి ప్రాజెక్ట్ ద్వారా వ్యవసాయంలోని నూతన శాస్త్రీయ పోకడలపైన ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఫుడ్ మిలైట్స్‌పై ప్రాజెక్ట్ ద్వారా అవగాహన, శిక్షన కల్పించారు. డంపింగ్ యార్డులలో తయారవుతున్న వర్మీ కంపోస్ట్‌లను తయారు విధానంపై నేరుగా వెల్లి శిక్షణ కల్పించారు.

ఎరువుల వాడకం తగ్గాలి..

ఉన్నతి ప్రాజెక్ట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన శిక్షణ ద్వారా వ్యవసాయ రంగంలో ఎరువుల వాడకం తగ్గించి వర్మీ కంపోస్ట్ వాడకం పెంచాలి. ఫుడ్ మిలెట్స్‌పై అవగాహన కల్పించారు. అలంపూర్, ఉండవెల్లి మండలాల నుంచి ఎంపికైన ఉపాధి కూలీలకు రోజు ఒక కల్చర్‌పై అవగాహన కల్పించారు. జన విజ్ఞాన కేంద్రంలోని శాస్త్రవేత్తలు శిక్షణ ఇచ్చారు.

– విజయ శంకర్, ఏపీఓ, ఉండవెల్లి

శిక్షణలో అన్ని సులభమైనవే..

15 రోజుల పాటు శిక్షణ నిర్వహించి ప్రతి దానిలో ఒక రంగానికి చెందిన వారితో శిక్షణ ఇప్పించి పూర్తి చేయించాం. కూలీల శిక్షణకు ఉపాధి తోడవుతుంది. ఫుడ్ మిలెట్స్‌పై కూడా అవగాహన కల్పించాం. మహిళల ఉపాధిపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశాం.

– శ్రీనివాసు, నోడల్ అధికారి

ప్రజాక్షేత్రంలో దాడులు సరైనవి కావు



బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: ప్రజాక్షేత్రంలో భౌతికదాడులకు తావులేదని, ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన కత్తిపోటు దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు సేవచేసి వారిని ఒప్పించి మన్ననలతో గెలవాలి కాని ఇలా భౌతికంగా దాడులు చేసి ఎన్నికల్లో విజయం సాధిస్తామని అనుకోవడం అవివేకమైన చర్య అని అన్నారు. సమావేశంలో ఎన్నికల ఇన్‌చార్జ్ రాకేష్, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, పార్టీ సీనియర్ నాయకులు నాగర్‌దొడ్డి, కౌన్సిలర్ శ్రీనివాసులు, వెంకట్రాములు, సుబాన్, సర్పంచు హనుమంతు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమాభివృద్ధి పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గద్వాల పట్టణం 7, 9వ వార్డులు, గద్వాల మండలం పూడూరు, కేటీదొడ్డి మండలం ఇర్కిచేడు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, కౌన్సిలర్ శ్రీనివాసులు, మధు, హరి, వంటభాస్కర్ పాల్గొన్నారు.

మల్దకల్: కాంగ్రెస్ పార్టీని నమ్మి ప్రజలు మోసపోవద్దని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పావనంపల్లి, పెద్దపల్లి, కుర్తిరావల్‌చెర్వు, నాగర్‌దొడ్డి, విఠలాపురం, చిప్పదొడ్డి, మల్లెందొడ్డి, ఎల్కూరు, పాల్వాయి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, రమేష్‌రెడ్డి, సత్యారెడ్డి, రమేష్‌రెడ్డిపాల్గొన్నారు.

స్థానికుడిని ఆశీర్వదించండి

కేటీదొడ్డి: స్థానికుడిని ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి ఓటర్లను కోరారు. మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు, మండల అధ్యక్షుడు ఉరుకుందు, హనుమంతు, నాయకులు టీచర్ గోవిందు, గోపి, నసీర్, యుగంధర్ పాల్గొన్నారు.

గట్టు: కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందని, దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచినట్లు జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడు, ఎంపీపీ విజయ్‌కుమార్, ఎమ్మెల్యే కుమారుడు బండ్ల సాయిసాకేత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బస్వాపురం, నల్లగట్టుతండా, బింగిదొడ్డి తండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బిలకంటి రాముశెట్టి, సర్పంచులు కృష్ణవేణి, జములమ్మ, ఎంపీటీసీలు ఆనంద్‌గౌడు, నర్సింహులు, ఉప సర్పంచులు పల్ల వి, పార్వతి, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అలంపూర్ అభివృద్ధి

రాజోళి: బీజేపీ అధికారంలోకి వస్తేనే అలంపూర్ నియోజకవర్గం మరో కోనసీమగా మారుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తుమ్మిళ్ల లిఫ్ట్, ఆర్‌డీఎస్ కెనాల్ ద్వారా నీరు ఇస్తామని అధికార బీఆర్‌ఎస్ పార్టీ రైతులకు కల్లబొల్లి మాటలు చెప్పి మోసం చేస్తోందని, మల్లమ్మ కుంట నిర్మిస్తున్నామని మాటలు చెప్పి, నేటివరకు దాన్ని నిర్మించలేదని, తాజాగా నదిలో నీరు లేకపోయినా, రైతులకు నీరు ఇస్తామని ప్రగల్భాలు పలకడం చూస్తే వారి ఓటమి వారికి తెలిసిపోయిందని, వారిని ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరని ఆయన ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్ పక్కకు పెట్టి, బీజేపి పట్టం కడతారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపి, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

పుల్లూరులో ప్రచారం

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరులో బీఆర్‌ఎస్ నుంచి టికెట్ ఆశిస్తున్న విజేయు లు ప్రచారం ప్రారంభించారు. మంగళవారం పు ల్లూరులో ఇంటింటి ప్రచారం చేపట్టారు. నాయకులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రచారంలో ముందుకు సాగారు. కార్యక్రమంలో పుల్లూరు నాయకులు పాల్గొన్నారు.

నందిన్నెలో వాహనాల తనిఖీ



కేటీదొడ్డి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దత్తురాజ్ ఆదేశాల మేరకు మండలంలోని నందిన్నె చెక్‌పోస్టు వద్ద మంగళవారం ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. అక్కడ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మద్యం, నగదు, అక్రమ రవాణాను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కర్ణాటక నుంచి వచ్చే వాహనాలను క్షుణంగా పరిశీలించాకే అనుమతి ఇవ్వాలన్నారు. వారి వెంట సీఐ శ్రీనివాస్, కానిస్టేబుల్ జగదీష్, వస్రంనాయక్, పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

వ్యాస రచన పోటీలో విద్యార్థి ప్రతిభ



గట్టు: పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా అక్టోబర్ 21 పురస్కరించుకుని విద్యార్థులకు ఆన్‌లైన్‌లో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని ప్రతిభ చాటింది. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రితిరాజు చేతుల మీదుగా ప్రథమ బహుమతి సాధించిన అశ్వినికి ప్రశంసాపత్రం అందజేశారు. ప్రథమ బహుమతి అందుకున్న ఆమెను జిల్లా నోడల్ అధికారి హృదయరాజు, కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్‌రెడ్డిలు అభినందించారు.

బాలికల హక్కులకు భంగం కలిగించొద్దు



కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యార్థి

రాజోళి: బాలికల హక్కులకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలుంటాయని ఎంవీ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి అన్నారు. మంగళవారం మాన్‌దొడ్డి గ్రామంలో క్లస్టర్ లెవెల్ కిశోర బాలికల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల హక్కుల గురుంచి మాట్లాడారు. బాలికల ఉన్నత విద్య, మౌలిక సదుపాయాల కల్పన, హక్కులలో ఎలాంటి ఇబ్బందులు కలిగినా ప్రశ్నించాలని, బాల్య వివాహాలకు పాల్పడితే, వాటి వల్ల జరిగే అనర్థాలను తల్లిదండ్రులకు తెలియచేయాలని విద్యార్థులు తోటి విద్యార్థులకు తెలిపారు. ఉన్నత విద్యనే లక్ష్యంగా ముందుకు సాగితే భవిష్యత్ బంగారుమయం అవుతుందని అధికారులు అన్నారు. కార్యక్రమంలో నాగపుల్లయ్య, రాజేంద్ర, ఉపాధ్యాయులు, కిశోరబాలికలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె నిర్మించండి

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రధాన కార్యాలయం ఆవరణలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, పాదచారులు భయాందోళనకు గురవుతున్నారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం, వ్యవసాయ కార్యాలయం, మిగతా కార్యాలయాలకు వెళ్లే దారి ఇదే కావడంతో నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ దారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వల్ల ప్రమాదాలు చోటుచేసుకోకముందే కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మానవపాడులో కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఇందిరాగాంధీ వర్ధంతి

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ హాజరై ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జోగుల రవి, రుక్మాందర్‌రెడ్డి ఉన్నారు.



ఇందిరాగాంధీకి నివాళులర్పిస్తున్న నాయకులు

జాతీయ సమైక్యతలో భాగస్వాములు కావాలి



సర్దార్ వలభాయ్ పటేల్‌కు నివాళులు

ఎర్రవల్లిచౌరస్తా: ప్రజలంతా పోలీసులకు సహకరించి జాతీయ సమైక్యతలో భాగస్వాములు కావాలని పదో పటాలం కమాండెంట్ సాంబయ్య అన్నారు. మంగళవారం ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి పదో పటాలంలో జాతీయ సమైక్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కమాండెంట్ హాజరై ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పటాలం ఆధ్వర్యంలో పోలీస్ ర్యాలీ (రన్ ఫర్ యూనిట్) ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పటాలం నుంచి ఎర్రవల్లి కూడలి వరకు అధికారులు, సిబ్బందితో మార్చి ఫాస్ట్ (పోలీస్ మార్చ్)ను నిర్వహించారు. అనంతరం జాతీయ సమైక్యత, సమగ్రత కోసం స్థానిక ప్రజలతో మమేకమై కూడలిలో ప్రతిజ్ఞ చేశారు. కమాండెంట్ మాట్లాడుతూ ప్రజలు ఎల్లప్పుడూ పోలీసులకు తోడుగా ఉండాలన్నారు. పోలీసులకు ప్రజల సహకారం ఉన్నంతకాలం ఎలాంటి సంఘటనలు జరగకుండా చూస్తారన్నారు.

పదో పటాలంలో మాస్ ప్లాంటేషన్

పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా పదో పటాలంలో మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ సాంబయ్య సామూహికంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం వీరమరణం పొందిన అమరులైన పోలీసులకు జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నాగభూషణం, అనిల్‌కుమార్, ఆర్‌ఐలు రాజారావు, రాజు, వెంకటేశ్వర్లు, గోపాల్, అధికారులు ఉన్నారు.

శాంతినగర్: భారతదేశ ఉక్కుమనిషి దివంగత సర్దార్ వల్లభాయ్ పటేల్ 148వ జయంతి వేడుకలను వడ్డేపల్లి మండలంలోని జూలెకల్‌లో నిర్వహించారు. జూలెకల్ యూత్ ఆధ్వర్యంలో పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సర్దార్ చేపట్టిన వివిధ సంస్కరణల గురించి, భారత దేశానికి ఆయన చేసిన కృషి గురించి ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

అయిజ: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం బీజేపీ నాయకులు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రజటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. జాతీయ స్వేచ్ఛ కోసం పోరాడిన సర్దార్‌వల్లభాయ్ పటేల్ గౌరవార్థం 2014 నుంచి ఆయన జయంతిని జాతీయ ఐక్యత దినోత్సవం పేరుతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నరసింహయ్య శెట్టి, పట్టణ ప్రధాన కార్యదర్శులు ప్రదీప్ కుమార్, భగత్ రెడ్డి పాల్గొన్నారు.

గట్టు: జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో సమైక్యతా రన్ నిర్వహించి అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారిణి గుంటి గోపిలత, ఉపాధ్యాయురాలు రేష్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వాలి



బూడిదపాడులో మాట్లాడుతున్న సరిత

మల్దకల్: ఒక్కసారి గద్వాల ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇవ్వండి.. రుణపడి ఉంటానని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత కోరారు. మంగళవారం మండలంలోని బూడిదపాడు, అడివిరావల్‌చెరువు, మంగంపేట గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ తరపున జెడ్పీ చైర్‌పర్సన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతోందని, గద్వాలలో కుటుంబ రాజకియాలు చేస్తూ, అభివృద్ధిని విస్మరించినట్లు ఆరోపించారు.గద్వాలలో మార్పుతో పాటుగా కుటుంబ పాలన విముక్తి కోసం కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్, మధుసూదన్‌బాబు, నల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటన్న, వెంట్రామిరెడ్డి, గోవిందు, ఆంజనేయులు, తాన్యానాయక్, శివ పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే పథకాల అమలు



ప్రజలతో మాట్లాడుతున్న సంపత్‌కుమార్

ఎర్రవల్లిచౌరస్తా: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సోనియాగాంధీ ప్రకటించిన ఆరు పథకాలను వెంటనే అమలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ అన్నారు. మంగళవారం ఎర్రవల్లి మండలంలోని కోదండాపురం, పుటాన్‌దొడ్డి గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. రైతులకు, మహిళలకు ప్రత్యేకంగా మేలు చేరూర్చడం కోసం పలు సంక్షేమ పథకాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జోగుల రవి, రుక్మందర్‌రెడ్డి, రాజ్‌కుమార్, వెంకటేష్ యాదవ్, వెంకటేష్, మద్దిలేటి, సుంకన్న పాల్గొన్నారు.

అయిజ: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ సతీమణి మహాలక్ష్మి పట్టణంలోని పలు కాలనీల్లో ఇంటింటికి తిరుగుతూ మహిళలకు బొట్టుపెట్టి ఓటువేయాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ హామీల గురించి వివరించారు. ఆమె వెంట వివిధ అలంపూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.

కార్మిక రాజ్య స్థాపనే లక్ష్యం



మాట్లాడుతున్న ఆంజనేయులు

గద్వాల అర్బన్: కార్మిక రాజ్యస్థాపనే లక్ష్యంగా పోరాడుదామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర దోపిడీ పాలనను గద్దె దించమే ధ్యేయంగా ముందుకెళ్దామన్నారు. మంగళవారం ఏఐటీయూసీ కార్మిక సంఘం 104 అవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయం ఆవరణలో ఆయన ఏఐటీయూసీ జెండాను ఎగురవేసి మాట్లాడారు. ఏఐటీయూసీ ఎల్లప్పుడూ కార్మికులకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమానికి సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు మోహన్ రావు పాల్గొని మాట్లాడారు. సమావేశంలో ఏఐటీయూసీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్ రావు, నాయకులు రాంనాథ్, ఆశన్న, గిరిరాజు, ఏఎస్‌ఎం యూనియన్ అధ్యక్షురాలు పద్మ ఉన్నారు.

పసి గుండెకు భరోసా



వైద్య నిపుణులను పూలబొకేతో ఆహ్వానం

గద్వాల క్రైం: శిశువులకు పుట్టుకతోనే గుండె సమస్యలు ఉంటాయని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సిద్దప్ప, గుండె వైద్య నిపుణులు దాసరి ప్రసాద్‌రావు(అపోలో ఆస్పత్రి) అన్నారు. మంగళవారం జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆర్‌బీఎస్‌కే(రాష్ట్రీయ బాల ఆరోగ్య స్వస్థ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరం కార్యక్రమంలో వారు మాట్లాడారు. శిశువులో చిన్న రంధ్రం పడటం, రక్త సవరణలో అవరోధాలు, పంపిగ్ వ్యవస్థ సరిగ్గా లేకపోవడం ఇలా ఏదో ఓ లోపం కన్పిస్తుందన్నారు. పుట్టుకతో వచ్చే గుండె వ్యాధి నిర్మూలనకు అత్యాధునిక వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. వైద్యులు జయరాజ్, మైథిలి, గంగాధర్, గణేష్, ప్రవీణ్, విజయ్‌కాంత్, సమ్రీన్, కౌసర్, తరుణ్‌రెడ్డి, ఇందిరా, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

ఎన్నికల కోడ్ నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ శివనందం గౌడ్

ధరూరు: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరు ఎన్నికల కోడ్ నియమావళిని పాటించాలని ధరూరు ఎస్‌ఐ శివనందం గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దపాడులో ఎన్నికల కోడ్ నియమావళి, ఓటు ప్రాధాన్యత అంశంపై మంగళవారం రాత్రి మండలంలోని పెద్ద గ్రామంలో జిల్లా ఎస్పీ రితిరాజ్ ఆదేశానుసారం కళాజాత బృందంతో ప్రదర్శనలు, అవగాహన సదస్సును నిర్వహించారు. సాధారణ రోజుల మాదిరిగా కాకుండా కోడ్ సమయంలో విధానాలను పాటించాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకునేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎవరైనా గ్రామాల్లో ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా మద్యం, నగదు, బహుమతుల రూపంలో ఇవ్వడం వంటివి చేస్తే వెంటనే వీడియో లేదా ఫొటోలు తీసి సీ విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో బృందం సభ్యులు హెడ్‌కానిస్టేబుల్ రాధమ్మ, హనుమంతు, కృష్ణ, రామాంజనేయులు పాల్గొన్నారు.